క్లుప్తంగా

నియామకం



రేగొండ: తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా యువత విభాగం కమిటీని జిల్లా అధ్యక్షుడు జోరిక సదయ్య, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ఆధ్వర్యంలో ఆదివారం నియమించారు. జిల్లా యువత విభాగం అధ్యక్షుడిగా మారబోయిన ధనుంజయ, ప్రధాన కార్యదర్శిగా పిట్టలు కేశవులు, ఉపాధ్యక్షులుగా జోడు ప్రదీప్, ముద్రవేని సురేష్, ప్రచార కార్యదర్శిగా సిరిసిల్ల నరేష్, సహాయ కార్యదర్శిగా జోడు సంతోష్, కార్యదర్శిగా రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు.

జిల్లా యూత్ ఉపాధ్యక్షుడిగా సురేశ్



మల్హర్: తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా యూత్ ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రం తాడిచర్ల గ్రామానికి చెందిన ముద్రవేణి సురేశ్ ముదిరాజ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ యువత విభాగం అధ్యక్షుడు పండుగ బాలు ముదిరాజ్, ఎన్ఆర్ఐ రాష్ట్ర ముదిరాజ్ కన్వీనర్ రాజ్ కుమార్‌లు సురేష్‌కు ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు.

దాడి సరికాదు

మల్హర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో విలేకరి నిట్టా సుదర్శన్‌పై దుండగులు ఇటీవల దాడి చేశారని దాడి చేయడం సరికాదని, అట్టి దాడిని తీవ్రంగాఖండిస్తున్నట్లుగా టీయుడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కోశాధికారి చింతల కుమార్ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్య తీసుకోవాలని ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

మిరపనారు చోరీ

కన్నాయిగూడెం: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలోని బొమ్మరాజు రవీందర్ అనే రైతుకు చెందిన మిర్చి నారును గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి దొంగలించారు. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రైతు రవీందర్ అనే వ్యక్తికి చెందిన మిర్చి నారు మడిలో ఉండగా రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఈమేరకు రైతు ఫిర్యాదు చేయడంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోష్ తెలిపారు. శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన ఎండి.సోహెల్ తన అత్తమ్మను తీసుకొని బైక్‌పై ఈనెల 17న పెద్దాపూర్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో తిరుమలగిరి స మీపంలో బైక్‌ను వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. ఆదివారం ఈ సంఘటనపై ఫిర్యాదు చేయగా సీఐ సంతోష్ ట్రాక్టర్ డ్రైవర్ అరికెల్ల రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శ

మంగపేట: మండలంలోని నర్సింహాసాగర్, కొత్త మల్లూరు, బ్రాహ్మణపల్లి, కత్తిగూడెం, తిమ్మంపేట తదితర గ్రామాలకు చెందిన పలువురు మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు ఆదివారం పరామర్శించారు.

వీఆర్ఏ రాజయ్య మృతి

టేకుమట్ల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 61ప్లస్ వీఆర్ఏ వారసుడిగా విధులు నిర్వర్తిస్తున్న రామకి ష్టాపూర్(వి) గ్రామానికి చెందిన అల్లకొండ రాజయ్య (43) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కాగా రాజయ్యకు భార్య రాధిక, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రాజయ్య మృతిపై రెవెన్యూ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

మల్హర్ : చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రుద్రారం గ్రామపంచాయతీ పరిధిలోని చిగురుపల్లిలో చోటు చేసుకుంది. కొయ్యూరు ఎస్సై నరేష్ కథనం ప్రకారం.. రవితేజ (20) పెద్దపేట గ్రామానికి చెందిన ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని ఈనెల 5న ఇంటికి తీసుకొని వచ్చాడు. ఈ క్రమంలో గ్రామంలో ఉండే అమ్మాయి బంధువులు రవితేజపై దాడి చేయడంతో అవమానం భరించలేక భయంతో అతను గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని భూపాలపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స అందించిన ప్రయోజనం లేదని వైద్యులు తెలుపడంతో ఈనెల 19న రవితేజను ఇంటికి తీసుకొచ్చారు. కాగా ఇంటికి తీసుకొచ్చిన కొద్ది సేపటికి అతను మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

‘ఉపాధి’కి ప్రణాళికలు సిద్ధం



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

గ్రామసభల్లో పనుల గుర్తింపు

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాం. గ్రామాల్లో ఏఏ పనులు చేయాలో తీర్మానాలు కూడా చేశారు. గ్రామాల్లో చేయాల్సినా పనుల వివరాలను తెప్పించుకుంటాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

- మాహబూబ్‌హుస్సేన్, ఎంపీడీఓ మొగుళ్లపల్లి

- గ్రామసభల ద్వారా పనుల ఎంపిక, తీర్మానాలు
- ఈజీఎస్ పనుల ద్వారా గ్రామాలాభివృద్ధి

మొగుళ్లపల్లి: పేదలకు వందరోజుల పాటు పని కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. ఈ పథకం ద్వారా పనులు చేపట్టడానికి మండలంలోని అధికారులు, ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించిన ఉపాధిహామీలో ఎలాంటి పనులు చేపట్టాలో గ్రామ అవసరాలకు ఎలా పనులు ఉపయోగపడుతాయో ఆ పనుల కోసం మండలంలోని ఆయా గ్రామాల్లో గ్రామసభలు కూడా నిర్వహించారు. ఈ గ్రామసభలో తీర్మానం చేసిన పనులను సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో అధికారులు గ్రామ సభలు నిర్వహించి గ్రామంలో ఏఏ పనులు చేపట్టాలో గ్రామసభలో తీర్మానాలు చేశారు.

ఉపాధిహామీలో చేపట్టే పలు పనులు

- మురుగునీరు రోడ్లపై పారకుండా ఇంటివద్దనే ఇంకుడుగుంతలను ఏర్పాటు చేయడం.
- పశువుల దాహన్ని తీర్చేందుకు నీటి తొట్టిలను ఏర్పాటు.
- పాఠశాలలో వంటగదుల ఏర్పాటు.
- రైతులకు టేకు మొక్కల పంపిణీ.
- రైతుల భూములను సారవంతం చేయడానికి చెరువు మట్టిని తరలించడం.
- చెలుకల్లో కందకాల తవ్వకం, పంట చేల వద్దకు రోడ్ల నిర్మాణం.
- చేపల కుంటల నిర్మాణం.
- భూగర్భ జలాలు పెంపొందించేలా నీటి సంరక్షణ పనులు.
- సాగునీటి కాలువల పూడికతీత.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1992–93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరు ఒకచోట కలుసుకొని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాటి గురువులను మెమోంటో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాలకు రూ.30 వేల విలువైన సౌండ్‌సిస్టంను అందజేశారు. ఉపాధ్యాయులు రాజయ్య, సుదర్శన్, వెంకటరామనర్సయ్య, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, సాంబయ్య, నాగరాజు, ఇక్బాల్, హరినారాయణ, పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు విజయపాల్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు రాజిరెడ్డి, అమరేందర్‌రెడ్డి, చింతకింది గణేష్, నాగరాజు, అంజిరెడ్డి, చర్లపల్లి వెంకటేశ్వర్లు, బాబు, నవీన్, రమేష్, పద్మ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మొదటి సాధారణ ప్రసవం



తల్లి బిడ్డతో వైద్యాధికారి నాగరాణి

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారిని డాక్టర్ నాగరాణి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం రంగాపూర్ గ్రామానికి చెందిన ఇంజపెల్లి మౌనికకు సాధారణ ప్రసవం చేశారు. పాప 2.8 బరువుగా జన్మించగా తల్లి బిడ్డలు క్షేమంగా ఉన్నారు. మొట్టమొదటిసారిగా మొగుళ్లపల్లి ఆరోగ్య కేంద్రంలో నార్మల్ డెలివరీ చేయడంతో వైద్య సిబ్బంది చాలా సంతోషపడుతున్నారు. ఇదేవిధంగా ఇక ముందు డెలివరీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విద్యాసాగర్, స్టాఫ్ నర్స్ కల్పన, ఆశ వర్కర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు



గొత్తికోయలతో మాట్లాడుతున్న పోలీసులు

భూపాలపల్లి రూరల్: గొత్తికోయలు మావోయిస్టులకు సహకరించొద్దని ఎస్సై దాసరి సుధాకర్ అన్నారు. భూపాలపల్లి మండలం దూదేకులపల్లి గ్రామ శివారులోని గొత్తికోయగూడెంలో ఎస్సై దాసరి సుధాకర్, సివిల్ అండ్ స్పెషల్ పార్టీ బృందాల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గొత్తికోయల పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా అనుమనాస్పందంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఎవరైనా వారికి సహకరించినట్లయితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎత్తు తక్కువ ఉన్న స్తంభాల తొలగింపు

శాయంపేట : స్థానిక మార్కండేయ స్వామి ఆలయం నుంచి బీసీ కాలనీ వరకు ఆదివారం ఎత్తు తక్కువ ఉన్న 9 పాత స్తంభాలను తొలగించి కొత్తవి విద్యుత్ ఏఈ చందూలాల్ ఆధ్వర్యంలో అమర్చారు. విద్యుత్ స్తంభాల పునరుద్ధరణలో భాగంగా మండల కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడంతో గ్రామస్తులు ఆదివారం కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రక్కన ప్రమాదకరంగా ఉన్న పాత స్తంభాలను తొలగించి 9.1 మీటర్ ఎత్తు ఉన్న హై టెన్షన్, లో టెన్షన్ విద్యుత్ స్తంభాలను అమర్చి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇంతేకాకుండా ప్రమాదకరంగా ఉన్న రెండు విద్యుత్ స్తంభాలను కూడా తొలగించామని తెలిపారు. ఆయనతో జూనియర్ లైన్‌మెన్ విష్ణు, కాంట్రాక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘ సేవకులు ధర్మంవైపు నడవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

ఏటూరునాగారం: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ సేవకులు (ఆర్ఎస్ఎస్) ధర్మం వైపు నడవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్ఎస్ఎస్ కార్యవాహక్ ప్రొఫెసర్ గద్దె రమేశ్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా మండలశాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఓడవాడ నుంచి బస్టాండ్ వరకు కరసేవకుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో రమేశ్ మాట్లాడుతూ.. సంఘం నియమాలను పాటిస్తూ దేశాన్ని ముందుకు తీసుకుపోవాలన్నారు. దేశ రక్షణ కోసం పాటుపడాలన్నారు. అలాగే మండల కేంద్రంలో పథ సంచాలన్ కార్యక్రమన్ని ఏటూరునాగారం ఖండ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండలాల కరసేవకులు, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

నిరసన దీక్ష కరపత్రాల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: ఉప కులాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో 57 ఉప కులాలను ఎస్సీ–ఏలో చేర్చాలని కోరుతూ.. నేడు (సోమవారం) హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టిన నిరసన దీక్షను విజయవంతం చేయాలని ఎస్సీ ఉపకులాల ఎస్సీ వర్గీకరణ రాష్ట్ర నాయకుడు, జిల్లా ఇన్‌చార్జ్ గడ్డం తిరుపతి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఉపకులాల సంఘాల నాయకులు జిల్లా కేంద్రంలో అంబేద్కర్ సెంటర్‌లో నిరసన దీక్షకు సంబధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపకులాల నాయకులు గోమస భూమయ్య, గోగుల మధన్ మోహన్, బౌతురాజేష్, కర్నేకంటి గోపాల్, గడ్డం ప్రసాద్, బాణాల శ్రీనివాస్, కర్నెకంటి అమరేందర్ ,చిలుక శేఖర్, దామోదర్, భిక్షపతి, కరుణాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్



చిట్యాల: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మొగుళ్లపల్లిలో..

భూపాలపల్లి: రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేస్తుందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు భరోసా ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతుందని తెలిపారు. ఇప్పటికైనా రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టేకుమట్ల: రైతులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ రైతు కార్మిక శాఖ మండల అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతు భరోసా రూ.15వేలను ఇస్తామని నమ్మబలికి ఇప్పుడు ఇవ్వడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ మండల నాయకులు ఉన్నారు.

మొగుళ్లపల్లి: ఈ వానాకాలం సీజన్‌కు రైతు భరోసా పోయినట్లే అని వ్యవసాయ శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలను నిరసనగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. వానాకాలం పంట సీజన్‌కు రైతుభరోసాను పూర్తిగా ఈ ప్రభుత్వం ఎగ్గొట్టేసిందని అన్నారు. వెంటనే రైతుల ఖాతాలో రైతు భరోసా వేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జోరుక సదయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడారి రమేష్, మాజీ సర్పంచ్‌లు దానబోయిన రాములు, గాలి చంద్రమౌళి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నేర్పాటి శ్రీనివాస్, మాజీ డైరెక్టర్ ముడుపు రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు చెక్క శ్రీధర్, దేవుని కుమార్, బోయిని స్వామి, రహీం, బైరగోని లవన్న, సప్పిడి సంపత్, సాంబయ్య, జగ్గారావు, రవీందర్‌రావు, యూత్ నాయకులు జాన్నె కమలాకర్, దార్ల ఆనంద్, తూముల నరేందర్ పాల్గొన్నారు.

రేగొండ: రైతు భరోసాపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతు భరోసాకు రాంరాం చెబతుందని ఎన్నికలకు ముందే కేసీఆర్ చెప్పిన మాటలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అక్షరాల నిజం చేసిందన్నారు. రూపిరెడ్డి చంద్రారెడ్డి, కానుగంటి శ్రీనివాస్, దగ్గు వెంకటేశ్వర్ రావు, బండి రమేష్, నర్సయ్య, దాట్ల రాజేందర్ పాల్గొన్నారు.

చిట్యాల: రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీతో పాటు రైతు భరోసా, ఆరు గ్యారంటీలు అమలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ధర్నా రాస్తారోకో చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ వానాకాలం సీజన్‌లో రైతు భరోసా పోయినట్లే అని వ్యవసాయ శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రాస్తారోకో నిర్వహించినట్లు తెలిపారు. ఎకరానికి రూ.15వేల రైతు భరోసా ఇచ్చే వరకు బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు తొటం నవీన్, ఉపాధ్యక్షుడు కాట్రెవుల కుమార్, ప్రధాన కార్యదర్శి రాజేందర్, నాయకులు రవీందర్ రావు, ఈర్ల మల్లక్క, రఘు, అశోక్‌రెడ్డి, పుట్టపాక మహేందర్, చాడ అనంద్‌రెడ్డి, జంబుల తిరుపతి, పులి వెంకటేష్, నిమ్మగడ్డ రాంబాబు, నారాయణరావు, పేరుమాండ్ల రవీందర్, చింతల రమేష్, కట్కూరి రాజేందర్, పాండ్రాల స్వామి, రమణాచారి, రాజు తదితరులు పాల్గొన్నారు.



రేగొండలో..



టేకుమట్లలో..

బైక్‌ను తప్పించబోయి ఆటో బోల్తా..

- ఒకరికి తీవ్ర, ఇద్దరికి స్వల్పగాయాలు
- జాకారం క్రాస్ వద్ద ఘటన



జాకారం క్రాస్ వద్ద బోల్తా పడిన ఆటో

ములుగు రూరల్: బైక్‌ను తప్పించబోయి ఓ ఆటో బోల్తాపడింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని జాకారం(అబ్బాపూర్ దారి) క్రాస్ వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా హసన్‌పర్తికి చెందిన శివకుమార్, సాయి వరంగల్‌కు చెందిన సుధాకర్ కలిసి ఆటోలో మేడారం సమ్మక్క –సారలమ్మ దర్శనానికి బయలుదేరారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గోరికొత్తపల్లికి చెందిన ఓంప్రకాశ్ బైక్‌పై హనుమకొండకు బయలుదేరాడు. అబ్బాపూర్ క్రాస్ వద్ద ఆటోను గమనించకుండా హనుమకొండ వైపుకు క్రాస్ చేశాడు. ఈక్రమంలో బైక్‌ను తప్పించబోయి ఆటో బోల్తాపడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న సాయికి తీవ్ర, శివకుమార్, సుధాకర్‌కు గాయాలయ్యాయి. గమనించిన బాటసారులు 108కు సమాచారం అందించగా ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఓంప్రకాశ్‌కు సైతం గాయాలైనట్లు సమాచారం.

కిరాయి మనుషులతో బీఆర్ఎస్ ఆందోళనలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

పరకాల: రైతు సంక్షేమం కోసం కోసం పాటుపడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ఈర్షతో బడా భూస్వాములకు మేలు జరిగే విధంగా హడావుడిగా కిరాయి మనుషులతో రైతు భరోసా కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతుల పక్షపాతి అన్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేకనే బీఆర్ఎస్ పార్టీ కిరాయి మనుషులతో ఆందోళన కార్యక్రమాలు చేయిస్తు అనవసర రాద్దాంతం సృష్టిస్తుందన్నారు. భవిష్యత్‌లో బీఆర్ఎస్‌కు మరోసారి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్, కట్కూరి దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఓంటేరు రాంమూర్తి, కాంగ్రెస్ నాయకులు చిన్నాల గోనాథ్, కొలుగూరి రాజేశ్వర్‌రావు, ఎం.డీ అలీ, బొమ్మకంటి చంద్రమౌళి, దాసరి భిక్షపతి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు



ఎస్సైని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రా మ అభివృద్ధి కమిటీ ఆదివారం ఎస్సై ప్రమోద్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. గ్రామ అభివృద్ధి కమి టీ చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలకై సహకారాన్ని అందించాలని ఎస్సైని కోరారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం మంచి కార్యక్రమాలు చేస్తూ యు వతకు మార్గదర్శంగా నిలుస్తూ అభివృద్ధి కో సం చేసే స్వచ్ఛంద కార్యక్రమాల్లో ఎల్లవేళలా మా సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ కన్వీనకర్, కో కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

దామెర: బీఆర్ఎస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తుందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని దుర్గంపేట్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు చిల్ల తిరుపతి గత జూన్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కాగా బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ద్వారా ప్రమాద బీమా వర్తింపజేయగా రూ.2 లక్షలు మంజూరయ్యాయి. కాగా చెక్కును తిరుపతి కుటుంబ సభ్యులకు ఆదివారం ధర్మారెడ్డి తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలు అకాల మరణం చెందితే పార్టీ తరపున ఆర్థికసాయం అందించి వారి కుటుంబలకు ఆర్థిక తోడ్పాటును అందించడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గండు రాము, మాజీ వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, రఘుపతి రెడ్డి, దాడి మల్లయ్య, నేరెళ్ల కమలాకర్ ఉన్నారు.